క్లుప్తంగా

30న ఉగాది వేడుకలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో ఈ నెల 30న ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆ రోజు ఉదయం 6గంటలకు ఆలయంలో స్వామివారికి అభిషేకం,10గంటలకు బ్రహ్మశ్రీ కలగ మురళీ కృష్ణ పంచాగ శ్రవణం, సాయంత్రం 6 గంటలకు బాలలచే ఆధ్యాత్మిక సాంస్కృతిక వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారు ఈ నెల 28 వరకు ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీషను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గణనాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న గణనాథుడు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో కొలువుదీరిన మహాగణపతికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గణనాథుడికి ఆలయ అర్చకులు గరికతో అర్చన చేశారు.అనంతరం పంచామృతాలు,సుగంధ పుష్పాలతో అభిషేకించారు.పట్టు వస్త్రాలు,ఆభరణాలను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

షటిల్ కోర్టు ప్రారంభం


షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే గణబాబు


గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన షటిల్‌కోర్టును బుధవారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులతో కొద్దిసేపు షటిల్ ఆడారు. క్రీడలపై యువత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. కార్యక్రమంలో నారిపిన్ని సత్తిరాజు, శరత్‌చంద్రన్ బాబు, తులసీరామ్, అలజంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

సమస్యలు పరిష్కరించండి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు జాబితా అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం జిల్లా బాధ్యులంతా కలసి డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ విజయవంతమయ్యేలా సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచి, వాటి పరిష్కారం కోసమని ప్రాతినిధ్యం వహిస్తామని, ఇందుకు జిల్లా విద్యా శాఖా .దికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, సహాధ్యక్షుడు, విశాఖ నగర అధ్యక్షుడు సుదర్శన్ పట్నాయక్, కోశాధికారి కె.సన్యాసినాయుడు తదితరులున్నారు.

ఆటలకు సై

క్రీడాకారులకు చక్కని వేదిక


ఓపెన్‌జిమ్ పరికరాలతో కసరత్తు చేస్తున్న స్థానికులు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


కబడ్డీ ఆడుతున్న బాలికలు

గోపాలపట్నం హైస్కూల్ ప్రాంగణం క్రీడాకారులతో నిత్యం కళకళలాడుతోంది. ఉదయం 5.30 గంటల నుంచి ఈ ప్రాంతంలో సందడి మొదలవుతుంది. క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాక్సింగ్ ఆడుకునేందుకు నిత్యం వందల సంఖ్యలో వచ్చే క్రీడాకారులకు ఇది చక్కని వేదికగా మారింది. పరిసర ప్రాంతాల్లో కొందరు వాకింగ్‌కు, మరికొందరు ఓపెన్ జిమ్‌కు కూడా వస్తున్నారు. ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన ఈ విశాలమైన ఈ మైదానంలో వసతులు కల్పిస్తే మరింత మందికి ఉపయోగపడుతుంది. – గోపాలపట్నం


గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న మహిళలు

మర్యాదపూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆ పార్టీ గోపాలపట్నం మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు తాడేపల్లిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – గోపాలపట్నం

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసుకుంటున్న ఇండస్ ఆస్పత్రి వైద్య సిబ్బంది


రోగిని పరీక్షిస్తున్న ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు

గోపాలపట్నం: ఎల్‌జీ పాలిమర్స్ సంస్థ వెంకటాపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. ఇండస్ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరంలో మొదటి రోజు 119 మంది, రెండో రోజు 169, మూడో రోజు 209 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎల్‌జీ పాలిమర్స్ ఘటన తర్వాత ఇక్కడి ప్రజలకు ఏ విధమైన వ్యాధులు వస్తున్నాయి, ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందనే విషయాలు తెలుసుకునేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా గ్యాస్ లీకేజీ వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయా, ఇతర ఇబ్బందులు, చర్మ సంబంధిత వ్యాధులు ఉన్నాయా, అవి ఎలర్జీనా లేక వాతావరణ మార్పుల వల్ల వచ్చినవా అన్న అంశాలను వైద్యులు పరిశీలిస్తున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జ్యోతి

గోపాలపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తలకు హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. సీడీపీవో శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. అంగవైకల్యం గల విద్యార్థులను గుర్తించడం, వారికి ఏవిధంగా బోధించాలన్న అంశాలను సూపర్‌వైజర్ జ్యోతి వివరించారు. పిల్లల స్థాయి ఆధారంగా బోధన ఉండాలన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.14.12 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీ లెక్కించారు. 37 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.14,12,593 నగదు, 173 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 11 కేజీల 100 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దుర్గాలమ్మ ఆలయ ఈవో పి.శేఖర్‌బాబు, సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ సహాయకులు డి.జె. ప్రభ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ నిర్మాణంపై ఎమ్మెల్యేకు వినతి

మల్కాపురం: మల్కాపురం గ్రామం సదనంపట్టు స్థలంలో రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే గణబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేను బుధవారం ఆయన కార్యాలయం వద్ద కలిసిన గ్రామ కమిటీ ప్రతినిధులు సమస్యను వివరించారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో ఉన్న సదనం పట్టు స్థలంలో ప్రస్తుతం మార్కెట్ నిర్వహణ, పండగ సమయాలలో అమ్మవార్ల ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని తెలిపారు. ఇప్పుడు ఆ స్థలంలో జీవీఎంసీ నిర్మాణం చేపడతామని ముందుకు వస్తోందని, అలా జరిగితే గ్రామకంఠానికి చెందిన స్థలం జీవీఎంసీ ఆధీనంలోకి వెళ్తుందని తెలిపారు. అలా కాకుండా హెచ్‌పీసీఎల్ లేదా కోరమాండల్ వంటి పరిశ్రమల సీఎస్సార్ నిధుల నుంచి గ్రామ సదనం పట్టు స్థలంలో రూఫ్‌టాప్ (ఇనప బీమ్‌ల మీద రేకులు) ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు వివరించారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో కమిటీ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం, అధ్యక్షుడు సత్యాల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు యాదవ్ తదితరులున్నారు.

అంతర్జాతీయ చట్టాల అధ్యయనంతో మెరుగైన ఉపాధి

డీఎస్ఎన్‌ఎల్‌యూ వర్క్‌షాప్‌లో న్యాయ నిపుణులు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న న్యాయ విద్యార్థులు


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య వెంకటరావు, తదితరులు

సబ్బవరం: ప్రపంచీకరణతో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిందని, దీంతో అంతర్జాతీయ చట్టాలు, న్యాయశాస్త్రం అవసరం మరింతగా పెరిగిందని గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో అంతర్జాతీయ చట్టంలో నూతన ధోరణులు, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతర్జాతీయ, దేశీయ చట్టాల అధ్యయనం ఎలా అవకాశాలను సృష్టిస్తుందో వివరించారు. జాతీయ న్యాయ పరిశోధనల్లో ఒకప్పుడు విశాఖపట్నం దేశంలోనే ప్రముఖంగా ఉండేదని, ఆ వారసత్వాన్ని డీఎస్ఎన్ఎల్‌యూ కొనసాగించాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య వివాదాలే కాకుండా, దేశ విదేశాల్లో వివిధ రకాల లావాదేవీలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే కేటగిరీలో చాలా ఉద్యోగావకాశాలున్నాయన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టం అభ్యాసంతో ఉద్యోగ అవకాశాలు, విద్యావిధాన రూపకల్పన అభివృద్ధిపై న్యాయ నిష్ణాతులు.. పరిశోధకులు, న్యాయ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ప్రపంచ న్యాయ సంస్థల్లో ఉపాధి మార్గాలు, అంతర్జాతీయ దౌత్యం, మధ్యవర్తిత్వంలో విద్యార్థులు, నిపుణులకు సహాయపడేందుకు రూపొందించిన గైడ్ ఆన్ కెరీర్స్ ఇన్ ఇంటర్నేషనల్ లా(సీఐఎల్‌ఏడీ) సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వశాఖలో చట్టపరమైన ఒప్పందాల విభాగం డైరెక్టర్ డాక్టర్ యడ్ల ఉమాశంకర్, వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసు, సెంటర్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ బి.నీలిమ, డాక్టర్ ఎస్.కిరణ్ కుమారి, షెర్లీ హెప్సిబా తదితరుల పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో పూజలు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గురువారం, శుక్రవారాల్లో ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. అదే విధంగా సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవారి ఘటాలను మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. ఇక శనివారం కొత్త అమావాస్య సందర్భంగా ఉదయం 5 నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పసుపు-కుంకుమతో అభిషేకాలు ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలంతా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి


కాకరలోవలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు రాంబాబు తదితరులు

సింధియా: పేదల సొంతింటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో నిరసన చేపట్టారు. ఆ పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ అచ్చినాయుడులోవలో సుమారు 4600, ములగాడ గ్రామంలో 326 టిడ్కో గృహాలను ప్రభుత్వం నిర్మించి రెండేళ్లు పూర్తి కావస్తున్నా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం కూటమి ప్రభుత్వం తక్షణమే అర్హులైన పేదలకు ఇళ్లు అందించాలన్నారు. అలాగే యువతకు ఉద్యోగాలు, సున్నా వడ్డీ రుణాలు అందజేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.కనకేశ్వరరావు, టి.కామేశ్వరరావు, శ్రీనివాసరావు, సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జీవిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదే


మొక్క నాటుతున్న సీఐఎస్ఎఫ్ అధికారి హ్రిషాబ్ దేవాంగన్

మల్కాపురం: ప్రతి జీవిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిపై ఉందని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ హ్రిషాబ్ దేవాంగన్ అన్నారు. మల్కాపురంలోని సీఐఎస్ఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రీన్ క్లైమేట్ టీం నేతృత్వంలో పక్షులు, మన్యప్రాణుల కోసం నీరు,ఆహారం అందుబాబులో ఉంచాలనే సంకల్పంతో బుధవారం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌పరిధిలో మొక్కలు నాటారు. పక్షులకు నీరు,గింజలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షులు, వన్య ప్రాణుల కోసం వేసవి కాలంలో నీరు,చిరు ధాన్యాలు,పప్పు ధాన్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇంటి దగ్గరలో గానీ,మేడపై గానీ ఓ చిన్న పాత్రలో నీరు, ఆహారం ఉంచాలని సూచన చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్‌కుమార్ శర్మ మాట్లాడుతూ మహానగరంలో మియవాకీ వంటి చిట్టడవులు పెంచడం అవసరం అన్నారు. తమ కార్యాలయం పరిధిలో ఇలాంటి మియవాకీని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులు సందీప్‌కుమార్,సయ్యద్, సంరక్షిక సంస్థ అధ్యక్షురాలు షీలా జైన్, గ్రీన్ క్లైమేట్ సభ్యులు జె.వి.రత్నం,మురళి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు గాలికి


ప్రజా చైతన్య యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ఎన్నికల ముందు ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేయడం చంద్రబాబు నైజం అని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఆరోపించారు. ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం 59వ వార్డు హనుమాన్‌నగర్ కొండ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లారు. ఆయన మాట్లాడుతూ హనుమాన్‌నగర్ కొండ ప్రాంతంలో సీసీ మెట్లు,సీసీ కాలువలు,రోడ్లు సరిగ్గా లేక ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా నేటికీ ఇక్కడ ఒక్క అభివృద్ధి పని చేయకపోవడం దారుణమన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు.కార్యక్రమంలో నాయకులు కె.రమణ,ప్రశాంత్,రామకృష్ణ, ఈశ్వరరావు,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రాంగణం.. శిథిలరాగం


కళ తప్పిన గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో కళాప్రాంగణం


బీటలు వారిన కళాప్రాంగణం వెనుకభాగం

గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్‌లోని కళాప్రాంగణం కళ తప్పింది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. వెనుకభాగం బీటలు వారి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని కూల్చి నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సంఘ అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో ప్రత్యేకంగా సంఘ ప్రతినిధులు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రమోషన్స్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ నియామకం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ప్రభుత్వ పథకాల మంజూరు వంటి అంశాలపై వారితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను సంఘం దృష్టికి తీసుకురాగా.. త్వరలో వాటి పరిష్కారం దిశగా ఉన్నతాధికారులను కలవనున్నట్లు తెలిపారు. అన్ని సంస్థల ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి, సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు.

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో నిర్వహించిన ఈ తరంగ్-2025 ఫెస్ట్‌లో భాగంగా జరిగిన ఆర్ట్ పోటీల్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఏడు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అభినందించారు. శతాబ్ది ఉత్సవాల్లో చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో ఆకట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలతో
విద్యార్థులకు తోడ్పాటు


సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వసుధ ఫార్మ కెమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తోంది. ఎంఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, ఎం.ఫార్మసీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ ప్రాంగణ నియామకాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. దీనిలో భాగంగా సంస్థ ఆపరేషన్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.కిషోర్‌కృష్ణ, కార్పొరేట్ హెచ్‌ఆర్ సి.హెచ్.ఎస్ రామశర్మలతో కూడిన నిపుణు ల బృందం బుధవారం ఏయూకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ తరఫున వీరిని రిజిస్ట్రార్ సత్కరించారు. ప్రాంగణ నియా మకాలను సద్వినియో గం చేసుకునేలా విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్స్-కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.మోహన్ గణేష్ పాల్గొన్నారు.